# థాంక్స్ టు శకుంతల

కొన్నేళ్ల క్రితం చదివిన-కీట్స్‌ని చంపిన విశాలాక్షి-కథ గుర్తు కొచ్చింది. పొరపాటు చేశానా అనిపించింది. నిజమే. కానీ ఇప్పుడేమిటి చెయ్యటం?

పెళ్లిళ్లు స్వర్గంలోనే జరుగుతాయనే మాట నిజమే ఐతే ఇలా జరగటం చాలా అన్యాయం. మొదట్లో గమనించలేదు. కానీ కొన్ని రోజుల్లోనే అంటే నాపట్ల ఆమెకున్న సిగ్గుతెరలు కొంచెం కొంచెంగా తొలగిపోగా-శకుంతల దృష్టిలో అందానికీ, అలంకరణకీ వున్న ఇంపార్టెన్స్ గురించి తెలిసినప్పుడు కొంచెం భయపడ్డాను.

ఎందుకంటే-ఈ విషయంపట్ల నాకు ఏ మాత్రం ఇంట్రస్టు లేదు. అందుకే నాలో సగాన్ని పంచుకునే అర్థాంగి గొప్ప సౌందర్యవతిగా-అందాలరాసిగా వుండాలని నేనెప్పుడూ కలలు కనలేదు. మామూలుగా వుంటే చాలు అనే అనుకున్నాను.

కానీ-పెళ్లి చూపుల్లో శకుంతలను చూసినప్పుడు నేను కోరుకున్న దానికంటే బాగుందనే అనిపించింది. నా పక్కనే వున్న మనుషులు నా అభిప్రాయాన్ని బలపరిచారు కూడా-

అందుకే-ఒప్పుకున్నాను.

పెళ్లయింది.

కొన్నాళ్లకు నా గుండెల్లో అశాంతికూడా మొదలయ్యింది.

ఇన్‌ఫీరియర్‌గా ఫీలవుతున్నట్టు కూడా అనిపించింది. శకుంతల యేమిటో-ఆమె అభిప్రాయాలు ఏమిటో తెలిసిన తర్వాత ఆమెతో సినిమాకు వెళ్లటానిక్కూడా నేను సాహసం చెయ్యలేకపోయాను.

శకుంతల గురించి పూర్తిగా నాకేమీ అర్థం కానప్పుడు ఒకరోజు ఆమెతో సినిమాకు బయల్దేరాను. థియేటర్ ఎక్కువ దూరంలో లేదు కాబట్టి నడిచే వెళ్దామని ఆమే సూచించింది.

నడుస్తున్నాం.

ఆమె ఏవో కాలేజీ కబుర్లు చెబుతోంది. అయిష్టంగానే వింటున్నాను. హఠాత్తుగా ఆ సంభాషణ మార్చేసి మాకు ఎదురుగా వస్తున్న ఇద్దరు మనుషుల్ని చూపించింది.

"ఏమిటి?" అన్నాను.

"అతను బావున్నాడు కదూ?"

నిజంగా షాకే. ఎందుకంటే పెళ్లయిన కొత్తల్లోనే మొగుడి పక్కనే నడుస్తూ ఇంకో మగాడ్ని బావున్నాడు కదూ-అంటే నేనెలా ఫీల్ కావాలి?

నా భావాలతో తనకు పనిలేనట్టుగానే-"నిజానికి అతను వేసుకున్న షర్టు మీకయితే బావుండదు. ఆ రంగులు అలాంటి మనుషులకే బావుంటాయి" అన్నది.

నేను మాట్లాడలేదు.

థియేటర్లోకి వెళ్లినా-సినిమా చూస్తున్నా నాకేమీ అర్థం కాలేదు. శకుంతలను అర్థం చేసుకునే ప్రయత్నంలోనే వుండిపోయాను.

సినిమా ఐపోయింది.

బయటకొచ్చి నడుస్తున్నాం.

శకుంతల అన్నది. "హీరోయిన్ హేర్‌స్టయిల్ బావుండ్లేదు. ఘోరంగా వుంది"

"నీకెట్లా తెలుసు?" అడిగాను ఏం చెబుతుందో అని.

"చాలా సింపుల్. కోలమొహం వున్న ఆడవాళ్లకి ఎత్తుగా వుండే హేర్‌స్టయిల్ అందంగా వుండదు. ఐనా మీకేమీ తెలియదా? అసలు ఆలోచించరా?"

"సినిమాకు వచ్చేది హీరోయిన్ జడ, హీరో మీసాలు చూట్టానికి కాదు శకుంతలా" అన్నాను.

"మరేం చూస్తారు?" నవ్వుతూ అడిగింది.

"కథ, మాటలు, పాటలు, దర్శకత్వం"

"స్క్రీన్‌ప్లే, సంగీతం వదిలేశారే?"

"నీతో మాట్లాడటం చాలా కష్టం.."

"థ్యాంక్‌యూ, ఒప్పుకున్నారు కదా...ఐతే నేను చెప్పేదేమిటో వినండి. ఏదైనా ముందుగా మనకు కనపడేది అందంగా, ఆకర్షణీయంగా వుండాలి. అందానికి ప్రాముఖ్యం లేదని యాభైయేళ్ల ఆడదాన్ని మేకప్ లేకుండా హీరోయిన్‌గా సినిమా తీస్తే కథ, మాటలు బావున్నాయని మీరు ఆ సినిమా ఒక్కసారయినా చూస్తారా?" అన్నది.

"ఆల్‌రైట్, ఇక నీతో వాదించలేను" అన్నాడు.

ఆశ్చర్యం ఏమిటంటే శకుంతల ఏ విషయం గురించి మాట్లాడటం మొదలు పెట్టినా చివరకు ఆ సంభాషణ అందం, ఆకర్షణ మీదకు వెళ్లిపోతుంది.

కొన్ని విషయాల్లో నేను బద్ధకస్తుడనే-నా దురదృష్టం కొద్దీ విషయాలన్నీ మనుషుల

అందాన్ని పెంచేవి. ఆకర్షణ కలిగించేవి.

రోజూ లేక రెండు రోజులకొకసారి షేవింగ్ చేసుకునే అలవాటు నాకు లేదు. నాలుగైదు రోజులకు, ఒక్కోసారి వారం రోజులకు షేవింగ్ చేసుకునే అలవాటు వుంది నాకు.

ఒకరోజు అడిగింది శకుంతల. "రోజూ షేవింగ్ చేసుకుంటే అందంగా కనపడతారనే భయం వుందా మీకు?"

"నా షేవింగ్ గురించి కూడా నీకు అవసరమా?" అడిగాను కొంచెం విసుగ్గా.

ఆమె నవ్వి "మీ గురించిన ప్రతి విషయం నాకు అవసరమే. ఎందుకంటే నేను మీ భార్యని..నా భర్తగా మీరెలా వుండాలో వూహించుకుంటున్న దాన్ని" అన్నది.

"నాకు బద్ధకం కొంచెం ఎక్కువ"

"నేనూ మీలాగే అనుకుంటే మీరు భోజనం చేసి టైముకి ఆఫీస్‌కి వెళ్లలేరనుకుంటాను" అని వెళ్లిపోయింది.

తీరిగ్గా ఆశ్చర్యపడ్డాను.

నేను షేవింగ్ చేసుకోవటానికి కూడా శకుంతల దృష్టిలో ఇంత ప్రాముఖ్యం వుందా?

"ఏమిటీ మనిషి?" అనిపించింది.

శకుంతల అందగత్తె కాదు. నిజానికి చాలా మామూలు మనిషి. సాధారణమైన అందం. ఐతే చూడగానే ఎవరికయినా గొప్ప అందమయిన మనిషిగా కనపడుతుంది. అట్లా కనపడటంలో వున్న గొప్పతనం అంతా ఆమెదే. ఆకర్షణీయంగా కనపడడానికి శకుంతల చేసుకునే అలంకరణ అటువంటిది. అట్లాగని శకుంతల గంటల తరబడి అతిగా అలంకరించుకోదు. కానీ ఆమెకు కొన్ని ముఖ్యమయిన విషయాలు బాగా తెలుసు. ఎట్లా అలంకరించుకుంటే తన అందం రెండింతలవుతుందో శకుంతలకు అద్భుతంగా తెలుసు.

ఆమె పెట్టుకునే బొట్టు-కళ్ల కాటుక-జడ వేసుకునే తీరు అన్నీ ప్రత్యేకంగానే ఉంటాయి. ఆమె బట్టల సెలక్షన్ కూడా భిన్నంగా వుంటుంది. తన శరీరం రంగుకి ఎటువంటి రంగు బట్టలు అందంగా వుంటాయో ఆమెకు చక్కగా తెలుసు. అందుకే ఏ క్షణంలో చూసినా, ఏ కోణంలో చూసినా శకుంతల అందంగా లేదు-అనే అవకాశం ఎవ్వరికీ రాదు.

ఉదయమే నిద్రలేవగానే జుట్టు చెదిరిపోయి,మత్తువదలని శకుంతల మోహాన్ని చూడాలని నేనెంతో ప్రయత్నించాను. కానీ సాధ్యంకాలేదు. ఆమె నాకంటే ముందుగానే నిద్ర లేచేది. నేను కళ్లు తెరిచేసరికి నవ్వుతూ స్నానం చేసి, తల దువ్వుకుని కడిగిన ముత్యంలా కనపడేది.

"నీకు బద్ధకం లేదా?"

"నాకే బద్ధకం వుంటే మీ బద్ధకం గురించి విమర్శించే అవకాశం నాకెలా వుంటుంది?" అన్నది.

ఎవరైనా కొన్ని రోజులు అందంగా, ఆకర్షణీయంగా కనబడటానికి ప్రయత్నం చేయవచ్చు. అతికష్టం మీద అలా కనపడవచ్చు కూడా–కానీ నెలల తరబడి ఎప్పుడూ ఒకే అందంతో, ఆకర్షణతో అన్నివేళల్లో కనపడటం అరుదైన విషయమని నా ఉద్దేశ్యం.

శకుంతల పక్కనే నేను నడుస్తున్నప్పుడు ఎక్కువమంది ఆమె అందాన్ని కళ్లతోనే మెచ్చుకోవడం నేను ఎన్నోసార్లు గమనించాను. నా భార్యే అయినా అలా కనపడుతున్నందుకు తిట్టాలనుకున్నాను. ఈ విషయంలో గొడవ పడాలనుకున్నాను.

కానీ ఎలా?

బావుంటుందా?

ఆమెకు నేను సరిపోయినవాడ్ని కాదేమో అనిపించింది. అలా అనిపించిన రోజు రాత్రి ఇదే మాట అన్నాను.

"నన్ను పెళ్లి చేసుకుని నువ్వు పొరపాటు చేశావేమో"

"ఎందుకలా అనుకుంటున్నారు?"

"నీ అందానికి, అభిరుచులకీ నేను సరిపోయిన వాడ్ని కాదనుకుంటాను"

"నా సెలక్షన్‌లో ఎప్పుడూ పొరపాటు జరగదు. ఆ నమ్మకం నాకుంది. మీరు నాకంటే అందంగా వుంటారు"

"మభ్య పెడుతున్నావా శకుంతల?"

"అంత అవసరం నాకు లేదు. మభ్యపెట్టడానికి మీరు చిన్న పిల్లవాడు కాదు. మీరు గాజుముక్క కాదనీ, వజ్రమేనని పెళ్లి చూపులప్పుడే గమనించాను. ఐతే కొంచెం సానపట్టాలనుకున్నాను"

"ఐనా బాహ్యంగా కనపడే అందానికి నీ దృష్టిలో ఇంత ప్రాముఖ్యత ఎందుకు? ఆత్మసౌందర్యం అవసరమైనదని నీకు తెలియదా?"

"తెలుసు. అట్లాగే అనుకుని బాగా అనాకారిగా, అసహ్యంగా వుండే ఒక అమ్మాయిని పెళ్లి చేసుకోలేకపోయారా ఎక్కడన్నా వెతికి పట్టుకుని"

శకుంతల ప్రశ్నకు నా దగ్గర రెడీగా జవాబు లేదు. ఆమె మాట్లాడే తీరు పూర్తిగా ఇట్లాగే వుంటుంది.

ఒకరోజు ఆఫీసు నుండి వచ్చేసరికి తళతళలాడుతున్న స్టీలు గిన్నెలను చూపించింది.

"ఎక్కడివి? కొన్నావా?" అడిగాను.

"కొనలేదు. మీ ప్యాంటులు, షర్టులు వేసి తీసుకున్నాను" అన్నది.

"నా బట్టలా?"

"అవును. ఒక్క జత వుంచి మిగిలినవన్నీ వేశాను. కంగారు పడకండి. రెండు జతల కొత్త బట్టలు మీకు నేనే సెలక్టుచేసి తీసుకొచ్చాను"

"నాకు బట్టలు కొన్నావా?" ఆశ్చర్యంగా అడిగాను. ఒకవైపు ఆమె ప్రవర్తన నాకు కోపాన్ని తెప్పిస్తూనే వుంది.

"ఆ మానాన్న నా పేరుతో బేంక్‌లో వేసిన వెయ్యి రూపాయల్లో ఆరొందలు డ్రా చేశాను" బట్టలు చూపించింది.

"ఈ రంగులేం బావున్నాయి? ఐనా వున్న బట్టలు స్టీలు సామాన్లకు వేసి ఈ బట్టలు కొనటం ఎందుకు?"

"మీకు తెలీదు. ఈ రంగులు మీ వంటికి అద్భుతంగా వుంటాయి. ఇప్పుడు మీరు వేసుకుంటున్న ఆ బట్టలు మీకు కొంచెం బావుండ్లేదు. బాధపడకండి" అన్నది కాఫీ ఇస్తూ.

అంతేకాదు, ఆ బట్టలను ఎలా కుట్టించుకోవాలో కూడా చెప్పింది. ఎక్కడ ఎక్కువ వదులు వుండాలో, ఎక్కడ టైట్‌గా వుండాలో అన్ని మేజర్‌మెంట్స్ క్లియర్‌గా చెప్పింది టైలర్‌కు ఇవ్వబోయే ముందు.

అన్నింటికి తలూపాను.

ఇంకోరోజు క్రాపు చేయించుకోటానికి సెలూన్‌కి బయల్దేరాను.

"ఆగండి...ఒక్క నిమిషం" అంటూ లోపలకు వెళ్లి ఏదో ఇంగ్లీషు పత్రికలో చించిన ఒక కాయితాన్ని తీసుకువచ్చింది.

"ఇదెందుకు?" అన్నాను అనుమానంగా.

"ఈ కాయితంలో వున్న బొమ్మ చూడండి. ఇదో అడ్వర్‌టైజ్‌మెంటు. ఇందులో వున్న మనిషిని జాగ్రత్తగా చూడండి. మీలాగే వున్నాడు. కళ్లు, ముక్కు,నుదురు, చెంపలు అన్నీ మీకు వున్నట్టుగానే వున్నాయి. కానీ మీకంటే అందంగా కనపడుతున్నాడు. ఎందుకంటారు? అందం అంతా హెయిర్‌స్టయిల్‌లోనే వుంది. అందుకే మీరు కూడా ఇదే స్టయిల్‌లో క్రాపు చేయించుకురండి" అన్నది.

ఆమె అభిరుచికి పొగడాలో, పూర్తిగా నన్నో అమాయక చక్రవర్తిగా భావిస్తున్నందుకు ద్వేషించాలో అర్థం కాలేదు. ఏమాత్రం ఇష్టం లేకుండానే శకుంతల చెప్పినట్టుగానే చేశాను.

తర్వాత కొత్తబట్టల్లో కొత్తరకం హేర్‌స్టయిల్‌లో నన్ను అంతులేనంతగా పొగిడింది శకుంతల.

"ఇప్పుడు బావున్నారు" అన్నది సంతోషంగా.

ఆరోజు ఆఫీసులో కూడా మారిపోయిన నా గెటప్ చూసి అంతా కంగారుపడ్డారు. వెంటనే నన్ను గుర్తుపట్టలేకపోయారు. ఆ డ్రస్సులో నా అందం హఠాత్తుగా నాలుగురెట్లు పెరిగిపోయినట్లుగా వాళ్లు నాకు చెప్పారు.

అప్పుడు నాక్కొంచెం గర్వంగా అనిపించింది. ఎప్పుడూ నావైపు చూడని లేడీ టైపిస్టు సుజాత కూడా ఆరోజు నన్ను చాలాసార్లు దొంగచూపులు చూసింది.

ఆ సాయంత్రం నిలువుటద్దం ముందు నిలబడి చూసుకుంటే నేను నేనేనా అనిపించింది.

శకుంతల దగ్గర నాకు వున్న ఇన్‌ఫీరియర్ ఫీలింగ్‌ని పోగొట్టుకోటానికి, ఆమెకి నేనే మాత్రం తీసిపోయినవాడ్ని కాదని చూసేవాళ్లకి అనిపించటానికి నేనేం చెయ్యాలో ఆ క్షణంలోనే నాకు అర్థమయింది.

అంతే-

ఆ రోజునుంచే నా అలవాట్లలో ఆలోచనల్లో ఎంతో మార్పు వచ్చింది. బద్ధకాన్ని పూర్తిగా వదిలేశాను.

రోజూ షేవింగ్ చేసుకోవటం మొదలుపెట్టాను. అరిగిపోయిన చెప్పుల్ని వదిలేసి నున్నగా మెరిసే లేటెస్టు బూట్లు తొడగటం మొదలుపెట్టాను. టక్ చేస్తున్నాను. క్రాపును చెరగ నివ్వటం లేదు. బట్టలు మాసిపోకుండా జాగ్రత్త మొదలు పెట్టాను.

నాలో కలిగిన ఈ మార్పునకు శకుంతల అసూయ పడుతుందనుకున్నాను. కానీ అలా జరగలేదు. ఎంతో సంతోషపడింది.

స్టూడియోకు తీసుకెళ్లి కొత్తగెటప్‌లో ఫోటో తీయించింది. మరో పాత ఫోటోను కొత్తగా తీయించుక్కున్న ఫోటో పక్కన వుంచి నాలో వచ్చిన మార్పును చూసుకోమన్నది చెప్పకుండానే.

సులభంగానే అర్థమయింది. పాత ఫోటోలో ఎక్స్‌ట్రా నటుడిలా వున్న నేను కొత్త ఫోటోలో హీరోలాగా వున్నాను.

ఆ క్షణంలోనే నేను గాజు ముక్కని కాదనీ, వజ్రాన్ననీ నమ్మకం కుదిరింది. నాలో వున్న ఇన్‌ఫీరియర్ ఫీలింగ్ ఎంతో దూరానికి ఎగిరిపోయింది.

ఆరోజు సాయంత్రం ఇంటికొచ్చేసరికి కాఫీకప్పుతో కనపడిన శకుంతలను చూసిషాక్ తిన్నాను.

ఎప్పుడూ కడిగిన ముత్యంలా వుండే శకుంతల అప్పుడు జుట్టు ముడివేసుకుని వుంది. మొహం కూడా కడుక్కోలేదనుకుంటాను.

"నువ్వు శకుంతలవేనా? ఏమిటి రూపం?"

"కొంచెం బద్ధకించాను. అంతే" అన్నది.

"నువ్వు బద్ధకించటమా?" ఆశ్చర్యంతో అడిగాను.

"నేనూ మనిషినేనండి..నాకూ బద్ధకం, నిర్లక్ష్యం, విసుగు కొన్ని టైములో వుంటాయి. అందం, ఆకర్షణ అంటే నాకెంతో ఇష్టం వున్నా మీకోసం-బద్ధకించిన సమయాల్లో కూడా దాన్ని చంపుకున్నాను"

"నా కోసమా?"

"అవును" పెళ్లయిన ప్రతి ఆడదీ తన భర్త అందంగా-హుందాగా వుండాలనే కోరుకుంటుంది"

"అంటే?"

"ఉద్యోగాలు చేసే ఆడవాళ్లని వదిలేస్తే మగవాడే ఎక్కువ టైము బయట నలుగురిమధ్య గడుపుతాడు. అందువల్ల నాలుగ్గోడల మధ్యనే ఎక్కువ సమయాన్ని వెళ్లదీసే ఆడదానికంటే ఎక్కువ టైము బయట నలుగురికీ కనపడే మగవాడే ఎక్కువ అందంగా, ఆకర్షణీయంగా వుండాలి. నేను కోరుకున్న ఎఫెక్టు మీలో వచ్చింది. నా కృషి ఫలించింది"

"ఇక నా అందం గురించి నేనేమంత ఇంట్రస్టు తీసుకోకపోయినా ఫరవాలేదు. ఐనా చూసే కళ్లకు తెలియాలి-ఇంటిపనుల్లో అలసి పోయిన ఓ ఇల్లాలి సహజమైన గెటప్ ఇది. గమనించారా? ఇందులో కూడా ఆకర్షణ వుంది" చెబుతోంది.

ఇప్పుడు నాకు బాగా తెలుసు-శకుంతలను పెళ్లి చేసుకోవటంలో నేను పొరపాటు చెయ్యలేదని.

(30-5-1986 స్వాతి సపరివారపత్రిక)